క్లుప్తంగా

నేడు మాలపాడులో మంత్రి సురేష్ పర్యటన

పొన్నలూరు: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదివారం మండలంలోని మాలపాడులో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మాలపాడు గ్రామానికి చేరుకొని కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అలాగే అసైన్డ్ భూమి రైతులకు కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలను అందజేస్తారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు తదితర పూజలు నిర్వహించారు. వేటలు కోసి మొక్కులు చెల్లించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నలూరు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రమాదేవి ఆదివారం తెలిపారు. వెల్లటూరు కార్యకర్త పోస్టును బీసీ–డి, వెంకుపాలెం ఆయా పోస్టును ఎస్టీ అభ్యర్థులకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీలోగా కొండపి ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు

లింగసముద్రం: మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు విచారణ చేపట్టినట్లు ఏపీఓ సమీర్‌బాషా తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ, గ్రామీణ నీటి పథకం, పంచాయతీరాజ్‌కు సంబంధించి జరిగిన పనులను డీఆర్పీల బృందం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కూలీలను విచారించి చేసిన పనులను తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. విచారణ అనంతరం గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి నివేదికను గ్రామ ప్రజలకు చదివి వినిపిస్తామన్నారు. అన్ని గ్రామాల్లో విచారణ పూర్తయిన తరువాత స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

జరుగుమల్లి: మండలంలోని కామేపల్లి పోలేరమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ అభిషేకాల అనంతరం పోలేరమ్మను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివ శంకర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం శివారులోని ప్రసిద్ధ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన అనంతరం ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్న కేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

కులగణన సర్వేకు సహకరించాలి



సీతారాంపురంలో కులగణన సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



మొగళ్లూరులో కులగణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుకుమార్



కోవిలంపాడులో కులగణనను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్

హనుమంతునిపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించి అన్ని వివరాలు చెప్పాలని ఎంపీడీఓ కె.లలిత అన్నారు. మండలంలోని సీతారాంపురం, దేవిరెడ్డిపల్లి, కూటాగుండ్ల, దొడ్డిచింతల గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆదివారం ఎంపీడీఓ కె.లలిత, ఏఓ క్రిష్టారావు, కార్యదర్శి శ్రావణ సంధ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, 14 సచివాలయ పరిధిలో కులగణన సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే సిబ్బంది మీ ఇళ్లకు వచ్చినపుడు సహకరించి సర్వేకు సంబంధించి అడిగిన వివరాలు చెప్పాలని కోరారు. సర్వే సిబ్బంది కులగణన సర్వే పారదర్శకంగా ఎటువంటి తప్పిదా లేకుండా పక్కాగా చేయాలని సూచించారు.

వెలిగండ్ల: కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ టి.సుకుమార్ అన్నారు. మండలంలోని రామగోపాలపురం, రామలింగాపురం, పి.నాగులవరం, మొగళ్లూరు, ఇమ్మడిచెరువు, గ్రామాల్లో జరుగుతున్న కుల గణన సర్వేను ఎంపీడీఓ టి. సుకుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుకుమార్ మాట్లాడుతూ సామాజిక వర్గాల వారీగా కులగణన చేసి సంక్షేమ పథకాల అమలు చేసేందుకు కులగణన సర్వే ప్రభుత్వం చేపట్టిందన్నారు. కుల గణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని 15 సచివాలయాల్లో కులగణన సర్వే ముమ్మరంగా సాగుతోందని ఎంపీడీఓ రషీక్‌అహ్మద్ అన్నారు. మండలంలోని నలదలపూరులో జరుగుతున్న సర్వేను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక వర్గాల వారీగా కులగణన చేసి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టిందన్నారు. సర్వే సులభంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి తెలియజేశారు. సిబ్బంది సర్వే సమయంలో ఇళ్లకు వచ్చినప్పుడు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ చూయించాల్సిన అవసరం లేదని, కేవలం సమాచారం మాత్రమే తెలియజేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సందర్శించి యజమానితో సర్వేకు సంబంధించిన అన్ని వివరాలు అడిగి తెలుసుకొని సర్వే చేయాలని సూచించారు.

సీఎస్‌పురం(పామూరు): సచివాలయ సిబ్బంది కులగణన సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సీహెచ్.రామచంద్రరావు అన్నారు. మండలంలోని కోవిలంపాడు, శీలంవారిపల్లె గ్రామాల్లో ఆదివారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు నిర్వహిస్తున్న కుల గణన సర్వేను సర్పంచ్ షేక్ ఖాదర్‌బీబుజ్జితో కలిసి పర్యవేక్షించారు. కులగణన వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియలో సచివాలయ సిబ్బంది పొరపాట్లు చోటుచేసుకోకుండా పారదర్శకంగా చేపట్టాలన్నారు. సచివాలయ సిబ్బంది కులగణన సర్వే పూర్తయ్యే వరకు ఒకే సెల్‌ఫోన్‌ను వినియోగించాలని, మొబైల్‌ఫోన్ మార్చకూడదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా కచ్చితంగా సర్వే పూర్తిచేయాలన్నారు. సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి, మండల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా షాపులు మూయండి



ప్రదర్శనలో పాల్గొన్న శ్రీరామభక్తులు

కందుకూరు: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని పట్టణంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని శ్రీరామ భక్తులు విజ్ఞప్తి చేశారు. శ్రీరామభక్తులు పెద్దబజార్‌లోని రామాలయం నుంచి కనిగిరి రోడ్డు, పామూరు రోడ్డుల మీదుగా ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ నేడు బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా అంకమ్మతల్లి దేవాలయం వద్ద భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెద్దబజార్‌లోని కోదండరామాలయంలో కోదండరామునికి పుష్పాయాగం నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి శ్రీకాంత్, పబ్బిశెట్టి శివ, మురారిశెట్టి శ్రీను, మోదడుగు నరశింహం, వెంకటేశ్వర్లు, చక్కా వెంకటకేశవరావు, కోట వెంకట నరశింహం, కొత్తూరి సుధాకరరావు, మెడికల్ షాపు నరశింహం, ఇస్కాల మధుసూదన్‌రావు, చన్నా రామాంజనేయులు, అలవల మాధవరావు, గుర్రం అల్లూరయ్య, ఓరుగంటి శంకర్, కొత్త బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు



అభిషేకానంతరం విశిష్ట పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ, నాయకులు, భక్తులు



మహానివేదనతో ప్రదక్షణలు చేస్తున్న అర్చకులు, కమిటీ సభ్యులు, భక్తులు

- వైభవంగా అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ రుత్వికులు మహంకాళి ప్రసాదుశర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి గర్భాలయాన్ని ప్రత్యేక పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వరుస సెలవు దినాలు కావడంతో పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, మాజీ చైర్మన్ పాములపాటి మాధవప్రసాద్, జిలకర నారాయణ, మధుసూదన్, సుబ్బరాయుడు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఐ నాయకులు

కందుకూరు: ప్రముఖ కమ్యూనిస్టు సిద్ధాంత కర్త లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.మాలకొండయ్య మాట్లాడుతూ 20వ శతాబ్దపు అరుదైన మేధావిగా లెనిన్ గుర్తింపు పొందారని చెప్పారు. ప్రజా సంఘాల నాయకుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచంలో విప్లవోద్యమాలు, స్వాతంత్రోద్యమాలకు స్ఫూర్తిని కలిగించిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. జాషువా సాంస్కృతిక ఐక్యవేదిక నాయకులు ముప్పవరపు కిశోర్ మాట్లాడుతూ లెనిన్ మహోపాధ్యాయ నడిపిన ఉద్యమాలకు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి వై ఆనందమోహన్, బౌద్ధ ధమ్మ నాయకులు గాండ్ల హరిప్రసాద్, చనమాల కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు ఎస్‌కే హుస్సేన్, ఆదినారాయణ, బాలబ్రహ్మాచారి, కోటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, అప్పుటూరి మాధవరావు పాల్గొన్నారు.

తీరంలో జూదం



తీరంలో ఆదివారం నిర్వహించిన కోడిపందేలు

ఉలవపాడు: మండల పరిధిలోని పెదపట్టపుపాలెం–రామాయపట్నం మధ్య ఉన్న తీరప్రాంతంలో ఆదివారం సందర్భంగా భారీగా కోడిపందేలు నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి కోడిపందెం వేయడానికి జూదరులు వచ్చారు. రామాయపట్నం, పెదపట్టపుపాలెంకు చెందిన కొందరు ఈ ఆట నిర్వహించినట్లు సమాచారం. ఆట జరుగుతున్న సమయంలో వివాదం కూడా జరిగిందని స్థానికులు తెలిపారు. గ్రామంలోని పెద్దలు ఈ కోడిపందెం నిర్వహణపై పోలీసులకు సమాచారం అందించారు. కానీ వివాదం జరిగిందని తెలియడంతో ఆటను నిలిపివేశారు. దాదాపు రూ.10 నుంచి రూ.30 లక్షల వరకు పందెం జరిగిందని సమాచారం. అయితే గొడవ జరగడంతో ఆటను నిలిపివేశారని, దీంతో పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లలేదని సమాచారం. ప్రతి ఆదివారం తీరప్రాంతంలో జూదం భారీగా జరుగుతోందని స్థానికులు తెలిపారు.

కొండపి నియోజకవర్గ ఓటర్లు 2,35,866

కొండపి(సింగరాయకొండ): కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పురుషులు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్ల తుది జాబితాలో ఓటర్లు మొత్తం 2,35,866 మంది ఉన్నారని ఈఆర్‌ఓ బి.నారదముని ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపూడి మండలంలో 33,697 మంది, పొన్నలూరు మండలంలో 33,352 మంది, జరుగుమల్లి మండలంలో 32,961 మంది, కొండపి మండలంలో 34,554 మంది, టంగుటూరు మండలంలో 49,055 మంది, సింగరాయకొండ మండలంలో 52,247 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఓటర్లకు ఆధార్ సీడింగ్ 97.56 శాతం పూర్తయిందని తెలిపారు. ఓటరు జాబితాలో సవరణలుంటే బీఎల్‌ఓ లేదా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ సాధారణ ఎన్నికల నామినేషన్ వరకు ఉంటుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఈఆర్‌ఓ స్పష్టం చేశారు.

విద్యుత్ మోటార్లలో కేబుల్ వైర్లు చోరీ

గుడ్లూరు: పొలాల్లో 9 విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్లపాలెం, గుడ్లూరు గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. గుడ్లూరుకు చెందిన రైతులు వెంకటేశ్వర్లు, క్రిష్టారావు, ప్రదీప్‌లు కొత్తపేట దగ్గర ఉన్న తమ పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి సోమవారం ఉదయం వెళ్లగా అక్కడ నాలుగు విద్యుత్ మోటార్లకు ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురై ఉండటాన్ని గమనించారు. అపహరణకు గురైన కేబుల్ వైర్లు విలువ రూ.20 వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. అలాగే గుండ్లపాలెంలో కిషోర్ మరో నలుగురు రైతులకు చెందిన పొలాల్లో 5 విద్యుత్ మోటార్లలో ఉన్న కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. వాటి విలువ రూ.25వేలు ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

దద్దాల నారాయణ యాదవ్‌ను గెలిపించుకుందాం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జిగా నియమించిన దద్దాల నారాయణ యాదవ్‌ను పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాజాల ఆదిరెడ్డి అన్నారు. ఆయన్ను కలిసిన ముప్పళ్లపాడు పంచాయతీ నాయకులతో ఆదివారం రాజాల మాట్లాడినట్లు చెప్పారు. చిన్న చిన్న సమస్యలుంటే అందరం కలిసి మాట్లాడుకుని పరిష్కరించుకుందామన్నారు. మనమంతా కలిసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుందామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.బెంజిమన్, మూరక వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, దిరిశం ఆదిరెడ్డి, నాగేశ్వరరావు, చిన్న బాలయ్య, దానియేలు, వెంకట చెన్నయ్య, పగులయ్య, అశోక్, బాలకృష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్‌లో విజేతగా నిలిచిన చేవూరు జట్టు

ముగిసిన ఆడుదాం ఆంధ్ర పోటీలు



ఖోఖోలో విజేతగా నిలిచిన అమ్మవారిపాలెం బాలికల జట్టు

గుడ్లూరు: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు ఆదివారంతో ముగిసాయని ఎంపీడీఓ రాజశేఖరరావు తెలిపారు. ఎంఎస్సార్ జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ఆదివారం చేవూరు–మోచర్ల సచివాలయం జట్లు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ముందుగా బ్యాటింగ్ చేసిన చేవూరు జట్టు 10 ఓవర్లలో 121 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్ చేసిన మోచర్ల జట్టు 115 పరుగులు చేయడంతో చేవూరు జట్టు 6 పరుగుల తేడాతో గెలిచి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను 21వ తేదీ వరకు మండల స్థాయిలో హోరాహోరీగా జరిగాయన్నారు. పురుషుల విభాగంలో కబడ్డీలో గుడ్లూరు–2, ఖోఖోలో గుడ్లూరు–1, వాలీబాల్‌లో మోచర్ల, షటిల్‌లో రావూరు జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో కబడ్డీలో అమ్మవారిపాలెం, ఖోఖోలో చినలాటరఫి, షటిల్‌లో దారకానిపాడు జట్లు గెలిచాయి. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు త్వరలో కందుకూరులో జరిగే నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాయని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పీడీ మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌లు పాల్గొన్నారు.

మండల క్రికెట్ ఫైనల్ విజేత టంగుటూరు–2

టంగుటూరు: మండలంలోని వల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో కారుమంచి–టంగుటూరు–2 సచివాలయాల జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. టంగుటూరు–2 జట్టు విజేతగా, కారుమంచి జట్టు రన్నర్‌గా నిలిచిందని ఎంపీడీఓ రత్నజ్యోతి తెలిపారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా కిట్లు పంపిణీ చేశారు.

యాదవుల ఐక్యతకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సోమ్‌ప్రకాశ్‌యాదవ్

కందుకూరు: రాష్ట్రంలో యాదవ ఐక్యత, అభివృద్ధికి అఖిల భారత యాదవ మహాసభ కృషి చేస్తుందని మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు సోమ్ ప్రకాశ్‌యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ సమావేశంలో ఆదివారం స్థానిక పద్మావతి గెస్టు హౌస్‌లో నిర్వహించారు. రాష్ట్రంలో యాదవులను చైతన్యవంతం చేసేందుకు దాదాపు 1800 గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని రంగాల్లో యాదవులను అభివృద్ధి చెందేలా మహాసభ తరుపున కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. బంకా దత్తాత్రేయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వరి, కార్యదర్శులు ఆంజనేయమూర్తి యాదవ్, పూర్ణచంద్రరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన లక్ష్మీప్రసాద్ యాదవ్, చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు చిమటా నారాయణస్వామి, కంద శ్రీకాంత్‌యాదవ్, మురళీకృష్ణ, సంగా రాముమాదవ్, బక్కమంతుల శ్రీను, మల్లికార్జున, సీహెచ్ రామారావు, కె.కిరణ్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షతలు పంపిణీ



శ్రీరాముని అక్షతలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

సింగరాయకొండ: అయోధ్య రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్టు అందజేసిన అక్షతలను ఆదివారం వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సత్రం బజారు, కరేటివారి వీధి, పంచాయతీ ఆఫీసు రోడ్డు, ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాల ఏల్చూరి భవానీ మాట్లాడుతూ.. సోమవారం అయోధ్య శ్రీరాముని ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని ఆలయాల్లో పూజా కార్యక్రమాలకు భక్తులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సెక్రటరీ కొత్తమాసు ఉదయలక్ష్మి, ట్రెజరర్ శ్రీరాం సుశీల, చెట్టు మహాలక్ష్మమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్ పోకూరి సుజాత లక్ష్మి పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



తలమళ్ల సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకృష్ణ

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ అన్నారు. పొదిలి మండలంలోని అన్నవరం, తలమళ్ల పంచాయతీల్లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ప్రధాని సందేశాన్ని చదివి వినిపించి, లబ్ధిదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కృష్ణ, నియోజకవర్గ వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.సుబ్బారావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌లు పులి శ్రీలత, తెల్లమేకల వెంకట సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శులు శేషు, శేషగిరి, లేళ్ల శ్రీనివాసరెడ్డి, నర్మద, కొత్తపులి వెంకటేశ్వరరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిక్షాను ఢీకొన్న ఆటో



క్షతగాత్రుడు బొజ్జా దేవయ్య

పామూరు: ఎదురుగా వస్తున్న రిక్షాను ఆటో ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరు డీవీపాలెంకు చెందిన బొజ్జా దేవయ్య రిక్షా తోలుకుని జీవిస్తుండగా భోజనానంతరం డీవీపాలెం నుంచి తిరిగి పామూరులోకి రిక్షాపై వస్తుండగా పామూరు నుంచి దూబగుంట్లవైపు వెళ్తున్న ఆటో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రిక్షాను ఢీకొట్టడంతో రిక్షాతోలే దేవయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రున్ని వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ఇమ్మడిచెరువులో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



మోటుపల్లిలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేపిస్తున్న ఎంపీడీఓ సుకుమార్

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు, మోటుపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ టి.సుకుమార్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ టి.సుకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. రైతులు పొలాలకు మందు ఎలా పిచికారీ డ్రోన్ సహాయంతో డెమో ద్వారా వివరించారు. సర్పంచులు గాలి తిరుపతిరెడ్డి, బాలయ్య, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలి

మద్దిపాడు: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేడు ఒంగోలుకు రోడ్డుమార్గంలో వస్తున్న సందర్భంగా జిల్లా ముఖ ద్వారమైన గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద బాలినేనికి స్వాగతం పలకడానికి భారీగా ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు ఒక ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి ఆయన జిల్లాలోకి ప్రవేశిస్తారని ఆయనకు ఘన స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.